జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

సోమవారం | 26-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 573 పేజీలు: 4 వెల : రూ.7

## రథసప్తమి వేడుకల నిర్వహణలో..

# యంత్రాంగం ఫెయిల్





4లో

* సుమారు రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా * అందుకుతగ్గట్టుగానే ఏర్పాట్లు * ప్రణాళిక బాగున్నా.. అమల్లో వైఫల్యం * ఎక్కడికక్కడ తోపులాటలు.. తొక్కిసలాటలు * వీవీఐపీల లైన్లు ఒకే * రూ.100, రూ.300, రూ.500, డోనర్ లైన్లలో భక్తులకు తప్పని తిప్పలు * స్వామి దర్శనం.. సామాన్య భక్తులకు మూడు నుంచి ఐదు గంటలు * భక్తులు పోటెత్తడంతో పాస్‌లు రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన యంత్రాంగం * క్యూలైన్లపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం * ఏర్పాట్లలో లోటుపాట్లు ఉన్నాయన్న కూటమి నేతలు * ఇంటి పండగలా మార్చేశారన్న విమర్శలు



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గ్రామీణ రహదారుల నిర్మాణానికి పెద్దపీట

**ఆమదాలవలస జనవరి 25 (వార్త):** ఆమదాలవలస మండలం బొబ్బిలిపేట గ్రామంలో పలు రహదారుల నిర్మాణాలకు ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి రహదారుల నుంచే ప్రారంభమవుతుందని, ప్రతి గ్రామానికి నాణ్యమైన రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బొబ్బిలిపేట నుంచి వెదుర్లవలస వరకు రూ.1.80 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించనున్న రహదారి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామాల మధ్య రాకపోకలు సులభమవడమే కాకుండా, రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా, బొబ్బిలిపేట గ్రామంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రూ 53 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోందు వెంకటరమణ, సనపల డిల్లేశ్వరరావు, నూకరాజు, తమ్మినేని చంద్రశేఖర రావు, బొడ్డేపల్లి గౌరీపతి, అన్నపు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.





## వైఎస్ఆర్సీపీ గ్రామ కమిటీలపై కసరత్తు

**కొత్తూరు, జనవరి 25 (వార్త):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అట్టడుగు స్థాయి నుండి బలోపేతం చేసే లక్ష్యంతో మండలంలోని పలు పంచాయతీల్లో గ్రామ కమిటీలు మరియు అనుబంధ విభాగాల కమిటీల నియామక ప్రక్రియ వేగవంతమైంది. ఇందులో భాగంగా శనివారం పార్టీ ముఖ్య నేతల బృందం పలు గ్రామాల్లో పర్యటించి, స్థానిక కార్యకర్తలతో సమావేశమయ్యారు. మండల పార్టీ అధ్యక్షులు గండివలస ఆనందరావు నేతృత్వంలోని ప్రతినిధులు మండలంలోని కడుము, హంస, బలద, కురిగాం, అల్తి, రాయల, మాకవరం మరియు కొద్దిగాం పంచాయతీలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో పార్టీ స్థితిగతులు, బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామ కమిటీలతో పాటు ఎస్సీ, బీసీ, మహిళా, యువజన విభాగాల వంటి అనుబంధ కమిటీల ఏర్పాటుపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోనూ నిబద్ధత కలిగిన కార్యకర్తలతో కమిటీలను వేసి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల పక్షాన పోరాడటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో మండల పార్టీ అధ్యక్షులు గండివలస ఆనందరావుతో పాటు జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబరు గుడబండి పోలయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు అగతముడి నాగేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు వనుము లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి సిరిపురం హరీష్, స్థానిక నాయకులు, వైఎస్ఆర్సీపీ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేపీఎల్-6 విజేత కొత్తూరు '11 స్టార్స్'




**కొత్తూరు, జనవరి 25 (వార్త):** గోగులు చల్లమనాయుడు జ్ఞాపకార్థం కొత్తూరులో నిర్వహించిన కేపీఎల్-6 (ఖూరా-6) క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. సుమారు 68 జట్లు పాల్గొన్న ఈ మెగా టోర్నీలో పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో మహాసింగి జట్టుపై కొత్తూరు 11 స్టార్స్ జట్టు ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన కొత్తూరు జట్టుకు 30,000 రూపాయల నగదు బహుమతి, రన్నరప్‌గా నిలిచిన మహాసింగి జట్టుకు 20,000 రూపాయల నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రతినిధి గోగుల వరప్రసాద్ మాట్లాడుతూ.. తన తండ్రి చల్లమనాయుడు స్మారకార్థం ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 68 జట్లు ఈ టోర్నీని విజయవంతం చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారుల సహకారం ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని మెగా టోర్నీలను నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ముగింపు వేడుకలో కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, కార్లెమ్మ సర్పంచ్ లోతుగడ్డ భగవాన్ నాయుడు, గోగుల బుజ్జి బాబు, బోర లక్ష్మణరావు తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పింఛను పునరుద్ధరించండి



**హిరమండలం, జనవరి 25 (వార్త):** భగీరథపురం గ్రామానికి చెందిన గిరిజన మహిళ కొత్తూరు రాములమ్మ భర్త 20 ఏళ్ల కిందట మృతి చెందడంతో ఆమె వితంతు పింఛను పొందుతోంది. అలాగే ఆమె కొడుకు కొత్తూరు ప్రకాష్ రావుకు కూడా వృద్ధాప్య పెన్షన్ అందుకుంటున్నాడు. 2022 సంవత్సరంలో కుటుంబంలో ఒకరికే పింఛను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ప్రకాష్ రావు కుటుంబంలో ఇద్దరు లబ్ధిదారులు ఉండడంతో అతని తల్లికి వితంతు పింఛను కొనసాగిస్తూ ప్రకాశరావుకు వృద్ధాప్య పింఛను నిలుపుదల చేశారు. ఆ తరువాత ప్రకాశరావు తల్లి అనారోగ్యంతో 2023లో మృతి చెందారు. ప్రకాశరావు వృద్ధాప్య పింఛను అందుకోవడానికి అర్హుడు కావడంతో అతని పింఛను ను పునరుద్ధరించమని సంబంధిత అధికారులతో పలుమార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పింఛను పైనే ఆధారపడి బ్రతుకుతున్న అతని కుటుంబానికి బతుకు భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల క్రితం రాత్రి సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లే సమయంలో కాలి భాగాన పాము కాటు వేయడంతో మంచానికే పరిమితం కావడంతో ఎటువంటి జీవనోపాధి లేక అష్ట కష్టాలు పడుతున్నారని ఆ కుటుంబం కన్నీరు మున్నీరు అవుతోంది. ప్రభుత్వం స్పందించి తన వృద్ధాప్య పింఛను పునరుద్ధరించి మా గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రకాశరావు కోరుతున్నారు.

## సారవకోటలో భారత్ ఆయిల్ శ్రీనివాస ఎనర్జీ స్టేషన్ ప్రారంభం

**సారవకోట, జనవరి 25(వార్త):** సారవకోట మండలంలో నరసన్నపేట-పాతపట్నం జాతీయ రహదారిపై పోప్పంగి ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన భారత్ ఆయిల్‌కు చెందిన శ్రీనివాస ఎనర్జీ స్టేషన్‌ను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా పెట్రోల్ బంక్ యాజమాన్యం ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. శాలువా, పూలమాలలతో సన్మానించి అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రిబ్బన్ కటింగ్ చేసి అధికారికంగా ఎనర్జీ స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వాహనదారులకు స్వయంగా పెట్రోల్, డీజిల్ పంపింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించాలని యాజమాన్యానికి సూచించారు. గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ పెట్రోల్ బంక్‌ను వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీనివాస ఎనర్జీ స్టేషన్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ యాజమాన్యం, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# అరసవల్లిలో వైభవంగా రథసప్తమి వేడుకలు

**శ్రీకాకుళం, జనవరి 25(వార్త):** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం, ప్రత్యక్ష నారాయణుడైన అరసవల్లి సూర్యనారాయణ స్వామి జయంతి ,'రథసప్తమి' వేడుకలు ఈ ఏడాది అత్యంత వైభవోపేతంగా, కన్నులపండువగా జరిగాయని రాష్ట్ర వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన ఈ మహోత్సవాలకు ఆదివారం , సప్తమి కావడంతో సెలవు దినం తోడవడంతో లక్షలాది భక్తులు అరసవల్లికి తరలివచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. 'ఆదిత్యాయ నమః' నామస్మరణతో క్షేత్రమంతా పులకించిపోయిందన్నారు. జిల్లా యంత్రాంగం మూడు నెలలుగా చేసిన నిరంతర, సమన్వయ కృషి సత్ఫలితాలను ఇచ్చిందని, ఏర్పాట్లపై భక్తజనం వ్యక్తం చేసిన సంతృప్తే ఇందుకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ముందెన్నడూ లేని విధంగా సామాన్య భక్తులకు ప్రాధాన్యత లభించిందని, అరగంటలోనే దర్శనం పూర్తవడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేయడం హర్షణీయమన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎప్పటికప్పుడు రద్దీని అంచనా వేసి తీసుకున్న చర్యలు అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, విద్యుత్, నగరపాలక, ఆరోగ్య శాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ వేడుకలను విజయవంతం చేశారని అన్నారు. భక్తుల సౌకర్యార్థం సేవలందించిన వివిధ స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయమని, వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ ఏడాది రథసప్తమి వేడుకలకు కాని వినీ రీతిలో రెండు లక్షల మందికి పైగా భక్తులు వచ్చి స్వామి దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారని పేర్కొన్నారు.

### కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షణ

రథసప్తమి వేడుకల సందర్భంగా అరసవిల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల సహాయంతో క్యూ లైన్లలో భక్తుల సరళి, భక్తుల రద్దీ పరిస్థితి, క్రౌడ్ నియంత్రణ తదితర అంశాలను విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడి క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితంగా, క్రమబద్ధంగా దర్శనం కల్పించేందుకు అవసరమైన సూచనలు అధికారులకు, సిబ్బందికి అందజేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టి ప్రశాంత వాతావరణంలో వేడుకలు సాగేందుకు జిల్లా పోలీసు శాఖ కృషి చేసింది.



### ముందస్తు పక్కా ప్రణాళికతో వేడుకలు విజయవంతం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో నిర్వహించిన రథసప్తమి మహోత్సవాలు జిల్లా పోలీసు శాఖ రూపొందించిన ముందస్తు పక్కా ప్రణాళికలు, ఆధునిక సాంకేతిక పర్యవేక్షణ, పటిష్ట పోలీసు బందోబస్తు వల్ల ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించబడ్డాయిని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదివారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రథసప్తమి సందర్భంగా భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా క్రమబద్ధంగా, వేగవంతంగా దర్శనం కల్పించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత చర్యలు చేపట్టింది. ఉచిత దర్శనం, రూ.100,300,500, డోనార్ల ప్రత్యేక దర్శనం క్యూ లైన్లను సమర్థవంతంగా నిర్వహిస్తూ భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శన వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. అరసవల్లి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల సహాయంతో క్యూ లైన్లలో భక్తుల రద్దీ పరిస్థితి, క్రౌడ్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ వ్యవస్థలను పర్యవేక్షించారు. భక్తుల అధిక రద్దీ సమయంలో నిరంతరం ఎప్పటికప్పుడు జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో పర్యటించి క్యూ లైన్లను సమీక్షిస్తూ, అధికారులకు సూచనలు చేస్తూ,భక్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టారు.వృద్ధులు,దివ్యాంగ భక్తులకు ప్రత్యేక క్యూ లైన్ల ద్వారా వేగవంతమైన దర్శనం కల్పించారు. ఆలయానికి వచ్చే ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల సురక్షిత రాకపోకల కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పరిస్థితి నియంత్రణలో కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి విధుల్లో అంకితభావంతో పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సమన్వయం, క్రమశిక్షణ, ప్రజా సేవా దృక్పథంతో పనిచేయడం వల్లే వేడుకలు విజయవంతమయ్యాయని ఎస్పీ పేర్కొన్నారు.

## గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

### నేడు ఆర్ట్స్ కళాశాల మైదానంలో జాతీయ పతాకావిష్కరణ

**శ్రీకాకుళం, జనవరి 25 (వార్త):** భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించనున్న ఈ జిల్లా స్థాయి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి, జిల్లా ప్రజలనుద్దేశించి ప్రగతి సందేశాన్ని ఇవ్వనున్నారు. వేడుకల నేపథ్యంలో ఆర్ట్స్ కళాశాల మైదానాన్ని అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జెండా ఆవిష్కరణ వేదిక, అతిథుల గ్యాలరీ, పరేడ్? మైదానం వద్ద ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ఇప్పటికే ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. భద్రత, ట్రాఫిక్? నియంత్రణపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అలాగే విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే స్టాల్స్ ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేలా తీర్చిదిద్దారు. ఈ జిల్లా స్థాయి వేడుకలను మరింత వైభవంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక రద్దు

**శ్రీకాకుళం, జనవరి 25(వార్త) :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం) నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను రద్దు చేసినట్లు కలెక్టర్ పుండ్కర్‌తో పాటు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీ దారులు ఎవ్వరూ కూడా సోమవారం ఉదయం జడ్పీ కార్యాలయానికి, పోలీసు కార్యాలయానికి రావద్దని సూచించారు.

## ఆధ్యాత్మిక శోభతో వసంత పంచమి



**శ్రీకాకుళం, జనవరి 25 (వార్త):** జిల్లాలో వసంత పంచమి వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. రాధాస్వామి సత్సంగ సభ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంతో పాటు జిల్లాలోని పలు శాఖల్లో భక్తులు ఆధ్యాత్మిక వేడుకల్లో మునిగితేలారు. నగరంలోని పెద్ద పోస్టాఫీసు ఎదురుగా ఉన్న సత్సంగ భవనాన్ని రంగురంగుల ముగ్గులు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. దయాల్‌బాగ్ ప్రధాన కేంద్రం నుంచి జరిగిన ప్రత్యక్ష ప్రసారాలను సత్సంగులు తిలకించారు. ఈ సందర్భంగా నిష్కామ సేవ యొక్క ఆవశ్యకతను చాటిచెప్పారు. ఫలితాల పట్ల మమకారం లేకుండా నిస్వార్థంగా కర్తవ్యాన్ని నిర్వహించడమే దయాల్?బాగ్? జీవన విధానానికి పునాది అని భక్తులు స్మరించుకున్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే సామూహిక ప్రార్థనలు, ఆధ్యాత్మిక గీతాల ఆలపనతో భవన ప్రాంగణాలు మారుమోగాయి. శ్రీకాకుళంతో పాటు పాలకొండ, ఖండ్యాం, సిరిపురం, రౌతుపేట, ఉంగరాడ బ్రాంచిల్లో వేడుకలు వైభవంగా జరిగినట్లు జిల్లా కార్యదర్శి ఎం. స్వామి శరన్? తెలిపారు. సత్సంగులంతా సోదర భావంతో ప్రార్థనల్లో పాల్గొని, అనంతరం సామూహికంగా ప్రసాదాలు స్వీకరించారు. ఆంధ్ర రాధాస్వామి సత్సంగ్ సంఘ సభ్యులు ఎం.ఎస్.ఆర్.ఎస్. ప్రకాష్ రావు పర్యవేక్షణలో వివిధ బ్రాంచిల కార్యదర్శులు డా. పి. ఆనందరావు (శ్రీకాకుళం), కె. మెహతాలాల్ (పాలకొండ), ఎం. జీవన్ లాల్ (రౌతుపేట), సి.హెచ్. సత్యరాజు (సిరిపురం), బి. విజయకుమారి (ఖండ్యాం), ఎస్. వరలక్ష్మి (ఉంగరాడ) తమ తమ పరిధుల్లో వేడుకలను సమన్వయం చేశారు. నిరాడంబరత, క్రమశిక్షణతో కూడిన ఈ వేడుకల్లో సత్సంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని వసంత పంచమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పాతపట్నం, జనవరి 25 (వార్త):** పాతపట్నం మండలం కాగువాడ గ్రామానికి చెందిన హరిశ్చంద్ర పండి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కొబ్బరి కాయల కోసం ఆదివారం పాతపట్నం ద్విచక్రవాహనంపై వెళుతుండగా బూరగాం ఎస్పీ వీధి జంక్షన్ వద్ద కారు ఢీకొంది. దీంతో హరిశ్చంద్ర పండి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ కె.శ్రీరామమూర్తి తెలిపారు.




### ఎస్ఎస్ఆర్ ప్రొడక్షన్ సమర్పణలో

# 'ప్రొడక్షన్ నెంబర్ వన్'

### నూతన చిత్రం తొలి షెడ్యూల్ ప్రారంభం

**శ్రీకాకుళం టౌన్, జనవరి 25(వార్త):** ఎస్ఎస్ఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై రూపొందుతున్న నూతన చిత్రం 'ప్రొడక్షన్ నెంబర్ వన్' తొలి షెడ్యూల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్రంలో హీరోగా ప్రముఖ నటుడు షకలక శంకర్, హీరోయిన్‌గా జోర్దార్ సుజాత జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి డా. సూర శ్రీనివాసరావు నిర్మాతగా వ్యవహరిస్తుండగా, ఈ సినిమాకి ప్రముఖ డైరెక్టర్ ఎస్ జె సూర్య దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసిన అనుభవంతో ఈ చక్కటి చిత్రానికి డైరెక్టర్గా వర్క్ చేస్తున్న ఆర్. వెంకట్ సత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రముఖ తెలుగు నటులు సన, రఘుబాబు కీలక పాత్రల్లో ధనరాజు, భద్రం నటిస్తున్నారు. సామాజిక అంశాలతో పాటు వినోదాన్ని మేళవించిన కథాంశంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు చిత్ర బృందం తెలిపింది. చిత్ర నిర్మాణం ప్రధానంగా శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో



జరగనుందని, తొలి షెడ్యూల్ చిత్రీకరణ వేగంగా సాగుతున్నట్లు నిర్మాత డా.సూర శ్రీనివాసరావు వెల్లడించారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే విధంగా ఈ సినిమాను రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.

### ఓటు హక్కు వినియోగంపై

## అవగాహన ర్యాలీ




**నరసన్నపేట, జనవరి 25(వార్త):** ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో నరసన్నపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ శరత్ తెలిపారు. జాతీయ ఓటర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమని, ప్రతి ఓటరు తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన రహదారి మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొని ప్రజలకు ఓటు హక్కు విలువను వివరించారు. ఈ ర్యాలీతో ఓటర్లలో చైతన్యం పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

### నరసన్నపేట డిగ్రీ కళాశాలలో

## 16వ జాతీయ ఓటర్ దినోత్సవం

**నరసన్నపేట, జనవరి 25(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పెద్దాడ లత మాట్లాడుతూ ఓటర్ల నిరంతర అప్రమత్తతే ప్రజాస్వామ్య విజయానికి మూల స్తంభమని పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆన్లైన్, ఆఫ్లైన్ మార్గాల ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. యువత ఓటరు నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శాంతి హేమ్?తో పాటు అధ్యాపకులు రవికుమార్, అన్నాజీ రావు, నాగరాజు, డిల్లేశ్వరరావు, పవిత్ర, శ్రీవిద్య, పూజా భరద్వాజ్ పాల్గొన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రజాస్వామ్యంపై అవగాహనను పెంపొందించాయని కళాశాల యాజమాన్యం తెలిపింది.






## మడపాంలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

**నరసన్నపేట, జనవరి 25(వార్త):** నరసన్నపేట మండలం మడపాం గ్రామంలోని వంశధార నది పరివాహక ప్రాంతంలో ప్రతిష్ఠితమైన అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశంలోనే అత్యంత ఎత్తైన అభయ ఆంజనేయ స్వామి విగ్రహంగా ఖ్యాతి గడించిన ఈ విగ్రహానికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి ఎత్తైన ఆంజనేయ స్వామి విగ్రహం దేశంలో మరెక్కడా లేదని పేర్కొన్నారు. నాలుగవ వార్షికోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## ఎట్టకేలకు మరమ్మతు పనులు

**సారవకోట, జనవరి 25 (వార్త):** సారవకోట మండలంలో అక్కివలస నుంచి బుడితి వెళ్లే రహదారిపై ఎట్టకేలకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. అక్కివలస సమీపంలో వంశధార ఎడమ కాలువపై ఉన్న వంతెన నుంచి బద్రి వరకు రోడ్డు పూర్తిగా పాడై వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆర్ అండ్ బి (రోడ్లు ్ఞ భవనాలు) శాఖ నుంచి రూ.50 లక్షల నిధులను మంజూరు చేసి రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతుండటంతో వాహనదారులు ఉపశమనాన్ని వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమ్మతులు పూర్తయ్యాక రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రమాదాలు తగ్గే అవకాశముందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# బారువ తీరంలో గంగా హారతి

* సముద్ర స్నానాలు ఆచరించిన భక్తులు
* ఆదిత్యునికి క్షీరాభిషేకం
* పాయసం చేసి నైవేద్యం
* కిటకిటలాడిన తీర ప్రాంతాలు

**సోంపేట, జనవరి 25(వార్త) :** జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలు జనసందడితో కిటకిటలాడింది. ఆదివారం వేకువజామున భక్తులు సముద్ర తీరానికి చేరుకుని స్నానాలు ఆచరించి సూర్య భగవానికి పూజలు చేశారు. పాయసం ఉండి నైవేద్యంగా సమర్పించారు. బారువలో ఆదిత్యునికి హారతినిచ్చారు. శివసాగర్ బీచ్, భావనపాడు, మొగదాలపాడు, కళింగపట్నంలో సముద్ర స్నానాలకు జనం పోటెత్తారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.





# ప్రభుత్వ భూములు కబ్జా

* ఆక్రమణదారులకు అధికార పార్టీ నేతల అండదండలు
* చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

**పలాస, జనవరి 25 (వార్త):** పలాస మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ భూములకు రెక్కలు వచ్చాయి. భూబకాసురులు ఆ భూములపై గెద్దల్లా వాలి కబ్జా చేసేస్తున్నారు. వీరికి అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీన్ని ఎవరైనా నిలదీస్తే దాడులకు సైతం పాల్పడుతున్నారు. పలాస నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం అన్న సామెతను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ భూములు ఆక్రమించేస్తున్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయలు విలువగల ప్రభుత్వ స్థలాలు, వరద కాలువలు, చెరువులు, సూది కొండ, నెమలి కొండ, ఎర్ర చెరువు, శనిశ్వర మెట్ట ప్రాంత భూములు గత కొద్ది నెలలుగా కబ్జా చేస్తున్నారు. అనంతపురం రెవెన్యూ పరిధిలో శ్రీ సత్య సాయి సదన భవనానికి ఎదురుగా సర్వే నెంబర్ 253-4లో 90 సెంట్లు '253-8 లో ఒక ఎకరా 91 సెంట్లు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై పలాస తహశీల్దార్ టి.కళ్యాణ్ చక్రవర్తి దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపించి నిర్మాణాన్ని నిలుపుదల చేసి ఆక్రమణలు తొలగిస్తామని, వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



* సుమారు రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా * అందుకుతగ్గట్టుగానే ఏర్పాట్లు * ప్రణాళిక బాగున్నా.. అమల్లో వైఫల్యం * ఎక్కడికక్కడ తోపులాటలు.. తొక్కిసలాటలు * వీవీఐపీల లైన్లు ఒకే * రూ.100, రూ.300, రూ.500, డోనర్ లైన్లలో భక్తులకు తప్పని తిప్పలు * స్వామి దర్శనం.. సామాన్య భక్తులకు మూడు నుంచి ఐదు గంటలు * భక్తులు పోటెత్తడంతో పాస్‌లు రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన యంత్రాంగం * క్యూలైన్లపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం * ఏర్పాట్లలో లోటుపాట్లు ఉన్నాయన్న కూటమి నేతలు * ఇంటి పండగలా మార్చేశారన్న విమర్శలు

# రథసప్తమి వేడుకల్లో.. యంత్రాంగం ఫెయిల్

**శ్రీకాకుళం, జనవరి 25 (వార్త):** రథసప్తమి వేడుకల నిర్వహణలో జిల్లా యంత్రాంగం ఫెయిల్ అయిందన్న విమర్శలు అన్ని వర్గాల నుంచి వినిపించింది. రథసప్తమి ఆదివారం పడడంతో సుమారు రెండు లక్షల మందికిపైగా భక్తులు వస్తారని యంత్రాంగం ముందుగానే భావించింది. అందుకుతగ్గట్టుగానే క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ రోప్‌వే పార్టీలతో పాటు తొక్కిసలాట జరగకుండా బారికేడ్లు వేసి అడ్డుకట్టవేసేందుకు సంసిద్ధమయ్యారు. అయితే.. అమల్లో మాత్రం యంత్రాంగం విఫలమైంది. శనివారం రాత్రి నుంచే భారీగా భక్తులు అరసవల్లి చేరుకున్నారు. సూర్యనారాయణస్వామికి క్షీరాభిషేకం చేసేందుకు, నిజరూప దర్శనం చేసుకునేందుకు తరలివచ్చారు. శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు తొలిపూజ జరిగింది. మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆ తర్వాత 12.45 గంటలకు భక్తులను క్యూలైన్లలో వదిలారు. వీవీఐపీల తాకిడి ఎక్కువ కావడం, వారంతా గంటల తరబడి ఆలయం లోపల ఉండడం వల్ల క్యూలైన్లలో ఉన్న భక్తులు అపసోపాలు పడ్డారు. ఎన్నడూ లేని విధంగా వీవీఐపీలకు ఈ సారి ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారి దర్శనం చేయించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. స్వామి వారి దర్శనం ఆలస్యం కావడంతో క్యూలైన్లలో ఉన్న భక్తులు నిరాశకు గురయ్యారు. దీంతో ఎక్కడికక్కడ తోపులాట, తొక్కిసలాట జరిగింది. జిల్లా ఎస్పీ, కలెక్టర్ క్యూలైన్ల నుంచే సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే కమాండ్ కంట్రోల్ ద్వారా దిశానిర్దేశం చేశారు. అయితే ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అప్పటికే క్యూలైన్లు ముందుకుసాగకపోవడం, భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుండడంతో యంత్రాంగం చేతులెత్తేశారు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో జిల్లా యంత్రాంగం ఒక ప్రకటన చేసింది. మధ్యాహ్నం 12 గంటల వరకూ భక్తులు అరసవల్లి రావొద్దని, ఆ తర్వాతే రావాలని ప్రకటించడంతో పాటు పాస్‌లన్నీ రద్దు చేశారు. దీంతో పాసులు ఉన్న వారంతా అసహనం వ్యక్తం చేశారు. పాసుల విషయంలో తీవ్ర గందరగోళం నెలకొంది. సుమారు పదివేలు పాస్‌లు ముద్రించినట్టు అధికారులు చెబుతుండగా, సామాన్య భక్తుల క్యూలైన్ల కంటే వీవీఐపీ, వీఐపీ, రూ.100, రూ.300, రూ.500 పాస్‌ల క్యూలైన్లు కిటకిటలాడాయి. దీన్ని చూస్తుంటే యంత్రాంగానికి ఆదాయంపై ఉన్న శ్రద్ధ, భక్తులపై లేదన్న అనుమానాలు అందరిలోనూ కనిపించింది.

## ఇంటి పండగలా మార్చేశారు..

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ అయితే రథసప్తమి ఏర్పాట్లపై అసహనం వ్యక్తం చేశారు. ఏర్పాట్లలో లోటుపాట్లు ఉన్నాయని, ఇది రాష్ట్ర పండగని, ఎవరి ఇంటి పండగ కాదని బహిరంగంగానే విమర్శించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని ఊహించామన్నారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి సైతం అరసవల్లిలో ఏర్పాట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య భక్తులకు అరగంటలో దర్శనం చేయిస్తామని చెప్పిన అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమైందన్నారు. ఆలయ పునర్నిర్మాణ దాత దివంగత వరుదు బాబ్జీరావు కుటుంబం కూడా దర్శనం సమయంలో తోపులాటలో చిక్కుకోవాల్సి వచ్చింది. బాబ్జీరావు కుమార్తె, వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఇబ్బందులు పడుతూనే అంతరాలయంలోకి వెళ్లాల్సి వచ్చింది.

## ఎలా వెళ్లాలో తెలియక నరకయాతన..

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్యూలైన్లలోకి ఎలా వెళ్లాలో తెలియక అవస్థలు పడ్డారు. ఏ వరుసలోకి వెళ్లాలో పోలీసులు సైతం చెప్పలేకపోవడంతో అసహనానికి గురయ్యారు. ముఖద్వారం వద్ద నిలువరించి ఒక్కసారిగా విడిచిపెట్టడంతో తోపులాట చోటుచేసుకుంది. ఉదయం 6 నుంచి 12 గంటల వరకు వీవీఐపీల దర్శనం గంటపాటు, వీఐపీ, విశిష్ట, ఉచిత దర్శనాలకు సుమారుగా 3 గంటల సమయం, సామాన్య భక్తులకైతే సుమారు ఆరుగంటల సమయం పట్టింది. భక్తులకు సరైన మార్గదర్శనం చేసే వలంటీర్లు కరువయ్యారు.
























Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546